సాక్షి తిరుపతి
ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



అక్రమ నిర్మాణాల కూల్చివేత

రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీ, వివేకానంద కాలనీలోని అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. - 8లో



వేడుకగా చక్రస్నానం

శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా చక్రస్నానాన్ని నిర్వహించారు. - 8లో



ఇద్దరికి తీవ్ర గాయాలు

సైదాపురం మండల సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. - 8లో

ఆగ్రహ జ్వాల



పాకాలలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్యకర్తలు

సీఎం జగన్‌పై రాళ్ల దాడి అమానుషం

- చంద్రబాబు, పవన్ నీచ రాజకీయాలకు నిదర్శనం
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెల్లుబికిన నిరసనలు

తిరుపతి మంగళం : 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై రాళ్లదాడిని అభిమానులు, నేతలు, కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఖండించారు. శనివారం రాత్రి ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు మిన్నంటించారు. జగనన్నకు వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రోద్బలంతో అగంతకుల చేత రాళ్లదాడి చేయించినట్టు ఆరోపించారు.



తిరుపతిలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బ్యానర్లను తగలబెడుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్లని బాబు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ బ్యానర్లు దహనం చేశారు. రాష్ట్ర ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని, దీన్ని చూసి ఓర్వలేక రౌడీమూకలతో రాళ్ల దాడి చేయడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు. చంద్రబాబు నీచ రాజకీలకు ఇది నిదర్శనమని మండిపడ్డారు. సింహంలాగా సింగిల్‌గా వస్తున్న జగనన్నను ఎదుర్కోలేక రాళ్ల దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. పాకాల మండల కేంద్రం, ఆర్టీసీ బస్టాండ్ కూడలి, దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద, శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ శ్రేణులు నిరసన చేపట్టారు. ఇది ముమ్మాటికీ టీడీపీ నాయకుల కుట్రతోనే జరిగిందని ఆరోపించారు. పార్టీ నాయకులు దొడ్డారెడ్డి శంకర్రెడ్డి, తిరుమలరెడ్డి, కోటూరు శశి, తాలూరి ప్రసాద్, మోహన్, శీను, సిద్దు, నాగరాజు, సింగిల్‌విండో చైర్మన్ మునీశ్వర్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మునీర్, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, గుండ్లూరి సురేష్, డాక్టర్ శివకుమార్, రాయలసీమ మోహన్, ఎంపీటీసీ సురేష్, సర్పంచ్ వసంత, నంద, జేసీపీ బాబు, ప్రకాష్, బాను, గిరి, హరీష్, రాజు, మురళి, బేటా, రెహంతుల్లా పాల్గొన్నారు.



శ్రీకాళహస్తిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన

జగనన్నపై దాడి పిరికిపంద చర్య



బెజవాడలో మేమంతా సిద్ధం బస్సు యాత్రలో జగనన్నపై చంద్రబాబు డైరెక్షన్‌లోనే టీడీపీ పిరికిపందలు దాడిచేశారు. బస్సు యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ఆదరాభిమానాలను చూసి ఓర్వలేక తెలుగుదేశం నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. జగనన్నపై ఎన్ని కుట్రలు చేసినా ప్రజల అండదండలు, ఆ దేవుని ఆశీస్సులు ఉన్నంతవరకు ఆయనను ముఖ్యమంత్రి కాకుండా ఎవరూ ఆపలేరు.

– మద్దిల గురుమూర్తి, తిరుపతి ఎంపీ

ఇది రాక్షస చర్య



చంద్రబాబు మనిషి రూపంలో ఉన్న రాక్షసుడు. అధికారం కోసం హత్యలకు కూడా వెనుకాడడు. జగనన్నకు లభిస్తున్న జనాదరణ చూసి ఓర్వలేకే దాడులు చేయించారు. ఇవి మనుషులు చేసే చర్యలు కావు. జనం గుండెల్లో నిలిచిపోయిన జగనన్నకు హాని జరిగితే జనం బుద్ధి చెబుతారు.

– బియ్యపు మధుసూదన్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

వాటిని నోటీసు బోర్డులో ఉంచుతాం



వివిధ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులు

సత్యవేడు: అభ్యర్థుల నామినేషన్లు, అఫిడవిట్లను ఎప్పటి కప్పుడు ఆన్‌లైన్‌లోనూ, నోటీస్ బోర్డులోనూ ప్రజల పరిశీలనకు ఉంచుతామని సత్యవేడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేపీ.నరసింహులు (డిప్యూటీ కలెక్టర్, ఏపీఐఐసీ తిరుపతి) తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో మండల నోడల్ అధికారులు, అఖిల పక్షం పార్టీ నాయకులకు నామినేషన్లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచే నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఎమ్మెల్యేగా పోటీచేసే సాధారణ కేటగిరి అభ్యర్థి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటల ముందు అభ్యర్థులు తప్పనిసరిగా వారి పేరిట, ఏదైనా గుర్తింపు పొందిన బ్యాంక్‌లో ఖాతా తెరవాలని చెప్పారు. కార్యక్రమంలో చందు, పవన్(వైఎస్సార్‌సీపీ), ప్రతాప్, మురళీకృష్ణ(బీజేపీ), దిలీప్(టీడీపీ), రమేష్(సీపీఎం), బాలగురవం బాబు(కాంగ్రెస్), తహసీల్దారు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాల వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న ముఖ్యఅతిథులు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ ఆయుర్వేద కళాశాల వార్షికోత్సవం శుక్రవారం రాత్రి మహతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్‌ఆర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఆయుర్వేదానికి సంస్కృతానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. ప్రస్తుతం సమాజంలో ఆయుర్వేద వైద్యానికి అధిక ప్రాధాన్యం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రేణుదీక్షిత్ మాట్లాడుతూ టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి సహాయ సహకారాలతో కళాశాల దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. ప్రస్తుతం కళాశాలలో 6 విభాగాలు ఉన్నాయని 240 పడకల సౌకర్యంతో ఆసుపత్రి నడుస్తున్నదని, రోగులకు సరిపడా మందులు అందిస్తున్నామని తెలిపారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. నోడల్ ఆఫీసర్ కె.విజయభాస్కర్‌రెడ్డి, కె.శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో సెక్టోరల్ ఆఫీసర్ల పాత్ర కీలకం

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్, రూట్ ఆఫీసర్ల పాత్ర కీలకమని చిత్తూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. చిత్తూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గంలోని సెక్టార్, రూట్ ఆఫీసర్లకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, కోడ్ అమలు, పోలింగ్ రోజు చేపట్టే విధులపై అవగాహన ఉండాలన్నారు. సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుని కమ్యూనికేషన్ ప్లాన్‌ను అమలు చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. పోలింగ్ రోజున సమర్పించాల్సిన రిపోర్టులపై అవగాహన పెంచుకోవాలన్నారు. పీవో, ఏపీఓల హ్యాండ్ పుస్తకాలను చదివి అవగాహన పెంచుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్ సౌందర్‌రాజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్ పనితీరు, ఆపరేట్ విధానం తదితరాలపై అవగాహన కల్పించారు. ఏఆర్వో, కమిషనర్ జె అరుణ, ఆర్డీవో చిన్నయ్య, పలమనేరు ఆర్డీవో మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సెలవు కారణంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. క్యూలు నిండాయి. వారికి అధికారులు శీఘ్ర దర్శనం కల్పించారు. రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది.

కూటమిని ఓడిద్దాం



వార్డులలో జోరుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

- సంక్షేమ పథకాలే ..జగనన్న గెలుపునకు సంకేతాలు
- తిరుపతిలో అభినయ్‌ని ఆశీర్వదించండి
- ఎన్నికల ప్రచారంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం: రాష్ట్ర ప్రజలను మరోసారి వంచించి మోసగించేందుకు ఏర్పడిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కూటమిని చిత్తుగా ఓడిద్దామని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతిలోని 41, 43 డివిజన్లతో పాటు శెట్టిపల్లి గ్రామంలో శనివారం కార్పొరేటర్లు లడ్డూ భాస్కర్, రాధ, రాజేష్, బత్తినబాబు, రామకృష్ణ ఆధ్వర్యంలో ఆయన మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ప్రతిపేదవాడికి మరింతగా సంక్షేమం ఎలా అందించాలన్న తపన జగనన్నదైతే, ప్రజలకు ఏ విధంగా మాయమాటలు చెప్పి అధికారంలోకి రావాలన్న దురాలోచన చంద్రబాబుదన్నారు. ఎన్నికల్లో ఒక్కడిగా వచ్చి పోటీచేసే దమ్ములేక పొత్తులు పెట్టుకున్న ప్రజాద్రోహి చంద్రబాబు అన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రాష్ట్ర ప్రజలంతా జగనన్న వైపే ఉన్నారన్నారు. జగనన్న అందించిన సుపరిపాలనతో ప్రతి పేదవాడి జీవితాన్ని మార్చినట్టు వెల్లడించారు.



కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

అభినయ్‌ని ఆశీర్వదించండి

చిన్న వయసులో పెద్ద ఆలోచనలు చేసి తిరుపతిని ఎంతో అభివృద్ధి చేసిన భూమన అభినయ్‌ని నగర ప్రజలంతా ఆశీర్వదించి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలంబాలాజీ, పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దుద్దేల బాబు, బొమ్మగుంట రవి, కొండ మునిరెడ్డి, ఎన్వీ సురేష్‌రాయల్, బెల్లం రమేష్, కంకణాల రమేష్, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, వరికుంట్ల నారాయణ, దూదికుమారి, వెంకటరెడ్డి, పార్టీ నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రాయల్, పెరుగు బాబూయాదవ్, మురళీయాదవ్, పోలిరెడ్డి నాగిరెడ్డి, బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్, బాలమురళీకృష్ణ, రాజు, మునిరామిరెడ్డి, గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కురుగొండ జనసంద్రం

- అట్టహాసంగా ఎన్నికల ప్రచారం
- వినాయక, నాగార్పమ్మ ఆలయాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రత్యేక పూజలు
- బాబు మాటలు నమ్మొద్దని హితవు



కురుగొండలో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కిలివేటి సంజీవయ్య, మద్దెల గురుమూర్తి

ఓజిలి: సూళ్లూరుపేట నియోజకవర్గానికి ఈశాన్య గ్రామమైన కురుగొండ జనసముద్రాన్ని తలపించింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి 2 వేల మందికి పైగా వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో కిక్కిరిసిపోయింది. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కిలవేటి సంజీవయ్య, మద్దెల గురుమూర్తి ఎన్నికల ప్రచారాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ముందుగా గ్రామానికి విచ్చేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు మానమాల గ్రామం వద్ద కురుగొండ మాజీ సర్పంచ్ ఆరణి దిలీప్ కుమార్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా కార్యదర్శి గెడి శ్రీధర్‌రెడ్డి 100 బైక్‌లతో ఎదురు వెళ్లి స్వాగతం పలికారు. తర్వాత వినాయక, నాగార్పమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, నేత ముమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించారు.

జగన్నను అద్వితీయంగా గెలిపించుకోవాలి

ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో కుల, మత, పార్టీ, వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్లతో సంక్షేమ పథకాలు గడప వద్దకే చేర్చినట్టు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, చెంగాలమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బాలచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు శ్రీమంత్‌రెడ్డి, దీపిక, ఎంపీపీలు అరుణారెడ్డి, అనీల్‌రెడ్డి, ధనమ్మ, రఘురెడ్డి, శేఖర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, జెడ్పీటీసీలు రవీంద్రరాజు, ప్రీస్కిళ్ల, జ్యోతమ్మ, రమేష్, మండల కన్వీనర్లు పాదర్తి హరనాథ్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటరత్నం, కురుగొండ, కుందాం పీఏసీఎస్ అధ్యక్షులు శోభారాణి, రాజారామిరెడ్డి, ఏఎంసీ జనార్దన్‌రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ వేనాటి రామచంద్రారెడ్డి, నాయకులు సర్పంచ్ శ్రీలక్ష్మి, ముమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆరణి దిలీప్‌కుమార్‌రెడ్డి, గెడి శ్రీధర్‌రెడ్డి, గెడి వేణురెడ్డి, వజ్జా గోపాల్‌రెడ్డి, శివారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖాదర్‌బా షా, మధుసూదన్‌రెడ్డి, ఉచ్చూరు హరినాథ్‌రెడ్డి, కాకాణి రవి, బట్టా అనీల్, గోపాల్‌రెడ్డి, సుబ్బరావుయాదవ్, మహిళ, యూత్ అధ్యక్షురాలు ప్రవీణా, బట్టా పృధ్వీకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

కురుగొండ ఎన్నికల ప్రచారంలో స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలతో ప్రతి పేదవాడికి అండగా నిలిచారన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలు, మహిళల సంక్షేమానికి సీఎం పెద్దపీట వేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.



నాగార్పమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు, నియోజకవర్గ నాయకులు

నేను సేవకుడిని!

- కరోనా కష్టకాలంలో ప్రజాసేవకే అంకితమయ్యా
- తిరుమల తరహాలో శ్రీకాళహస్తిని అభివృద్ధి చేయాలన్నదే నా లక్ష్యం
- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



ప్రచారానికి పోటెత్తిన జనం (ఇన్‌సెట్) మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'కరోనా కష్టకాలం వచ్చినపుడు అందరూ భయపడి ఇళ్లకే పరిమితమయ్యారు. అలాంటి సందర్భంలో నేను ప్రజల సేవలోనే తరించా. ప్రాణాలు పణంగా పెట్టి ప్రజలను కాపాడా'నని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. తాను ఐదేళ్లుగా ప్రజలకు అందుబాటులో ఉన్నానని, ఎవరికి ఏ ఆపదొచ్చినా పిలిస్తే పలుకుతున్నానని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరో సారి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శనివారం పట్టణంలోని 11, 12, 13, 14, 15 వార్డుల్లో ప్రజాశీర్వాద పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సంత మైదానం నుంచి బయలుదేరి అంకమ్మ గుడి మీదుగా ముత్యాలమ్మ గుడివీధిలోకి చేరుకున్నారు. అక్కడి నుంచి ఏడుగంగమ్మల గుడి, ముత్యాలమ్మగుడి మీదుగా పెండ్లి మండపం వద్దకు చేరుకుని ఓటేరు కాలువ మీదుగా గాంధీవీధి, వినాయకుని గుడి వద్దకు చేరారు. అక్కడి నుంచి నగాచిపాళెం మీదుగా పాత బస్టాండు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాణాలకు తెగించి కరోనా కష్ట కాలంలో సేవ చేశానన్నారు. తాను బతికినంత కాలం ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు.

మళ్లీ అవకాశమిస్తే వీటిని నెరవేర్చుతా

- ఆలయాన్ని రూ.100కోట్లతో మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా అభివృద్ధి చేస్తా.
- రూ.20 కోట్లతో శివం టూ శివం రోడ్డుకు శంకుస్థాపన చేశా. అది పూర్తయితే శ్రీకాళహస్తిలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది.
- స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూకు అనుసంధానం చేయడానికి అన్ని పత్రాలు సమర్పించా.
- రేణిగుంట వద్ద బాలాజీ మెడికల్ కళాశాలను తీసుకువచ్చా. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి అనుబంధంగా మరో మెడికల్ కళాశాల తీసుకొస్తా.
- పట్టణంలో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నా.
- సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ కెపాసిటీని పెంచి పట్టణానికి మరింత మెరుగైన తాగునీరు ఇవ్వడానికి కృషి చేస్తా.

పార్టీలో చేరిక

14వ వార్డుకు చెందిన టీడీపీ నాయకుడు కాపిరాల శ్రీనివాస్ జెట్టి ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, గుమ్మడి బాలకృష్ణయ్య, జనార్దన్ రావు పవార్, పగడాల రాజు, వయ్యాల కృష్ణారెడ్డి, జయగోపాల్, మల్లికార్జున్‌గౌడ్, మాబాషా, లత, హరినాయుడు, కంఠా ఉదయ్, సెన్నీచుకుప్పం శేఖర్, రమేష్, గురునాగరాజు, స్వర్ణమూర్తి, ప్రభాకర్, గరికపాటి చంద్ర, పాండు, మాలతి, రవి, కిరణ్, నాజర్, కమలమ్మ, కిషోర్, సుబ్బరాయులు, జయ, సుశీల, రూపేష్, సరళ, సున్ని, అబ్బయ్య, శ్రీనివాస్, శరవణ, పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

సైదాపురం: మండలంలోని తిప్పిరెడ్డిపల్లి సమీపంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం.. మండలంలోని చాగణం రాజుపాళెం గ్రామానికి చెందిన పోట్లూరు సాయి వ్యక్తిగత పని నిమిత్తం శుక్రవారం రాత్రి సైదాపురం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. అదేవిధంగా కంభం వెంక టేశ్వర్లు కూడా అదే సమయంలో రాపూరు నుంచి సైదాపురానికి వస్తున్నాడు. తిప్పిరెడ్డిపల్లి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో బైక్‌లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో సాయి, వెంకటేశ్వర్లు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డీఎస్ విజయ్‌కుమార్ తెలిపారు.

దేశ ఉన్నతికి ఎన్‌ఆర్‌ఐలు కృషి చేయాలి

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కార్యక్రమంలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

తిరుపతి సిటీ : ఎన్‌ఆర్‌ఐలు దేశ ఉన్నతికి తమవంతు కృషి చేయాలని హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. శనివారం తిరుపతి మహిళా వర్సిటీ సావేరీ సెమినార్ హాల్ వేదికగా 'ఎంపవరింగ్ రూరల్ ఇండియా ఎకనమీ– ద రోల్ ఆఫ్ ఎన్‌ఆర్‌ఐస్' అనే అంశంపై ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్, అమెరికన్ ప్రొగ్రెసీవ్ తెలుగు అసోసియేషన్ యూఎస్‌ఏ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం పట్ల ఎన్‌ఆర్‌ఐలకు ఉన్న ప్రేమ ఎనలేనిదని, ఎంతో మంది విదేశాల నుంచి వచ్చి మాతృ దేశానికి సేవ చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాలో విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పడాలన్నారు. అనంతరం మహిళా వర్సిటీ వీసీ డీ.భారతి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమవుతుందన్నారు. తిరుపతి చాప్టర్ చైర్మన్ డాక్టర్ పార్థసారథి, తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు రాజాబ్రహ్మం, సింగపూర్ తెలుగు సమాజం మాజీ కార్యదర్శి హరీష్ రాయల్, ఎన్‌బీఆర్ గ్రూప్ చైర్మన్ వేణుగోపాల్, లావణ్యకుమార్, వడ్లమూడి గురప్ప, కే.పూర్ణచంద్రరావు, షేక్ మస్తక్, చైతన్యకుమార్‌రెడ్డి, రాధారాణి అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో జోష్



వైఎస్సార్‌సీపీలో చేరిన యువతకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి



నేదురుమల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన బాలాయపల్లి మండల టీడీపీ నేతలు



పార్టీలో చేరిన ఇరంగారిపల్లి వాసులతో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీలో జోష్ నెలకొంది. పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతుండడంతో క్యాడర్‌లో ఉత్సాహం రెట్టింపయ్యింది. శనివారం తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో తిరుపతి 19వ డివిజన్‌కు చెందిన నవీన్‌కుమార్, దినేష్, రవితేజతో పాటు వందల మంది యువత టౌన్ బ్యాంక్ డైరెక్టర్ మబ్బు నాదమునిరెడ్డి, పార్టీ యువజన విభాగం నాయకులు అరకాల సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రజలను మోసగించి వంచించడానికి ఏర్పడిన చంద్రబాబు కూటమిని కూలదోయడానికే వైఎస్సార్‌సీపీలో చేరినట్టు వారు పేర్కొన్నారు. టౌన్‌బ్యాంక్ డైరెక్టర్లు బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్ర, చిరంజీవి, అనీల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాకాలలో పది కుటుంబాలు చేరిక

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో కీలక రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ కేడర్ పూర్తి స్థాయిలో వైఎస్సార్‌సీపీ గూటికి చేరుకుంది. శనివారం తుమ్మలగుంట నివాసం వద్ద తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పాకాల మండలం.. ఇరంగారిపల్లి పంచాయతీకి చెందిన 10 టీడీపీ కుటుంబాలు అధికార పార్టీలో చేరాయి. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో టీడీపీ సీనియర్ ఎస్సీ నాయకుడు ప్రకాష్, మురుగేష్, గణేష్, చిన్న, పవన్, ధనుష్, కార్తీక్, పూర్ణ ప్రసాద్, జగదీష్, విగ్నేష్ తదితరులు ఉన్నారు. తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారిని సాదరంగా స్వాగతించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు ప్రజాసంక్షేమానికి సంకల్పించిన వైసీపీ ప్రభుత్వం, పార్టీ సిద్ధాంతాలు నమ్మి చేరే వారికి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ మునీర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శివకుమార్, డివిజన్ అధ్యక్షుడు సురేష్, సర్పంచ్ వసంత, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు రాయ లసీమ మోహన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

బాలాయపల్లిలో టీడీపీ ఖాళీ

బాలాయపల్లి(సైదాపురం) : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన పనులకు ఆకర్షితులై టీడీపీ నేతలు, కార్యకర్తలు తమ పార్టీలో చేరుతున్నారని, దీంతో బాలాయపల్లి మండలంలో టీడీపీ ఖాళీ అవుతోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలం, పిగిలాం ఎస్టీ కాలనీ, వెంగమాంబపురం పంచాయతీలకు చెందిన సుమారు 150 కుటుంబాల వారు శనివారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెందోటి కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వెంగమాంబపురం, పిగిలాం సర్పంచ్‌లు బాపనపల్లి వెంకటసుబ్బయ్య, గాలగంధ లక్ష్మి, ఉప సర్పంచ్ మల్లెల వెంకటేశ్వర్లు, అలిమిలి ఎంపీటీసీ కంటిపల్లి మాధవి, గుర్రం రామ్మూర్తి యాదవ్, మల్లెల బాలాజీ, తుపాకుల శ్రీనివాసులు, మావిళ్లపల్లి మస్తాన్, శ్రీహరి, రామకృష్ణ నాయుడు, అక్కూర్తి పెంచలయ్య, వెంకటరామయ్య పాల్గొన్నారు.

వేడుకగా శ్రీకోదండరాముని చక్రస్నానం



కపిలతీర్థం పుష్కరిణిలో చక్రస్నానం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శనివారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. రాత్రి ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీలక్ష్మణ సమేత సీతారాములవారు పల్లకీలో కపిలతీర్థానికి వేంచేశారు. అక్కడ శ్రీవేణుగోపాలస్వామివారి ఆలయ మండపంలో స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంచేపట్టారు. అనంతరం అర్చకుల వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. తర్వాత అక్కడి నుంచి స్వామివారు శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోని పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం అక్కడి నుంచి బయల్దేరి తీర్థకట్టవీధి, కోటకొమ్మల వీధి మీదుగా శ్రీకోదండ రామాలయానికి చేరుకున్నారు. మధ్యలో శ్రీఆంజనేయ స్వామి వారి ఆలయం, శ్రీవైఖానసాచార్యుల ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ధ్వజావ రోహణంతో శ్రీకోదండరామ స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. తిరుమల పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, కంకణభట్టర్ సీతారామాచార్యులు, సూపరింటెండెంట్ సోమశేఖర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఇరువర్గాలకు సర్దిచెబుతున్న ఎస్‌ఐ సునీల్



రేణిగుంట వివేకానంద కాలనీ సమీపంలో కూల్చివేస్తున్న అక్రమ కట్టడాలు

రేణిగుంట: రేణిగుంట మండలం, తూకివాకం పంచాయతీ పరిధిలోని వివేకానందకాలనీ ఆనుకుని ఉన్న వాగుపోరంబోకు స్థలంలో కొంతకాలంగా నిర్మించుకున్న ఇళ్లను శనివారం తూకివాకం గ్రామానికి చెందిన యువకులు, మహిళలు వచ్చి జేసీబీ సాయంతో కూల్చివేశారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ స్థలాన్ని తాము దశాబ్దాల తరబడి గ్రామ అవసరాల నిమిత్తం కాపాడుకుంటూ వస్తుంటే వివేకానంద కాలనీకి చెందిన కొందరు వామపక్షాల నాయకులు పేదల పేరుతో అక్రమ కట్టడాలను చేపట్టారని ధ్వజమెత్తారు. అయితే ఈ విషయమై తూకివాకం గ్రామస్తులు తరచూ ఇక్కడకు వచ్చి అక్రమ నిర్మాణాలను అడ్డుకుంటూ వచ్చారు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో మూడు నెలలుగా వాగుపోరంబోకు స్థలంలో సుమారు 80 ఇళ్లను నిర్మించారు. అందులో కొందరు పేదలు కూడా ఆశపడి అప్పులు చేసి సిమెంటురాళ్లతో చిన్నపాటి రేకుల ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే తూకివకానికి చెందిన సుమారు 100మంది అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో ఇళ్లను కూల్చివేశారు. అడ్డువచ్చిన వారితో వాగ్వాదానికి దిగారు. తోపులాటలు జరిగాయి. ఈ దాడిలో హమీదా, పురుషోత్తం అనే వారికి గాయాలు కావడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. విషయం తెలుసుకున్న గాజులమండ్యం ఎస్‌ఐ సునీల్‌కుమార్ తమ పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న తూకివాకం సర్పంచ్ మునిశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని తమ గ్రామానికి చెందిన యువకులు, మహిళలకు సర్దిచెప్పి తీసుకెళ్లారు.

ముగ్గురు నిందితుల అరెస్టు



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: మండలంలోని రంఘునాథపురం తెలుగు గంగ బ్రిడ్జి సమీపంలో జరిగిన దారిదోపిడీ, మల్లవారిపాళెం టౌన్‌షిప్ కాలనీలో జరిగిన చోరీ కేసులో నిందితులు కుప్పాని వంశీ(21), ఇరుగుళం గ్రామానికి చెందిన సంజయ్(20), విజయపురం మండలం, ఆలపాకం గ్రామానికి చెందిన దేవిప్రియ(19)ను అరెస్టు చేసినట్లు సీఐ దివాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం నిందితులు, చోరీచేసిన రెండు ద్విచక్ర వాహనాలు, స్వాధీనం చేసుకుని, మూడు మొబైల్‌ఫోన్లు మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా సీఐ కథనం.. నాగలాపురం మండలం, రాజులకండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఫిబ్రవరి 23వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఇంటి నుంచి ఒంటరిగా ద్విచక్ర వాహనంపై శ్రీసిటీకి బయలుదేరాడు. రంగనాథపురం గ్రామ సమీపంలోని తెలుగుగంగ కాలువ బ్రిడ్జి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు వాహనాన్ని అడ్డగించి, బైక్‌పై ఉన్న వ్యక్తిని గాయపరిచారు. ఆపై అతని వద్ద నుంచి రూ.1,500 నగదు, మొబైల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐలు వీరాంజనేయులు(సత్యవేడు), ప్రతాప్(వరదయ్యపాళెం), పోలీసులు కుప్పారావు, సురేష్, సాయి, మహేష్, ప్రత్యేక బృందంగా ఏర్పాటై నిందితులను శనివారం ఉదయం సత్యవేడు సమీపంలోని ఉలవ చేను వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు. తాగుడుకు, గంజాయికి బానిసలై కొంత కాలంగా వీరు దారిదోపిడీ, దొంగతనాలకు పాల్పడుతున్నట్లు సీఐ తెలిపారు. కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు అందజేశారు.